తెలుగుప్రభ
మన భాష.. మన పత్రిక
శుక్రవారం 14-7-2023
మైట్రెంట్ ఎడిషన్ 1 pm
teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial


## దుర్గమ్మ అనుగ్రహంతో ముందుకు: పురందేశ్వరి



**తెలుగుప్రభ,విజయవాడ(జూలై14):**

ఆంధ్రప్రదేశ్ బీజేపీలో ఎలాంటి వర్గాలు, విభేదాలు లేవని పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి చెప్పారు. ఉదయం విజయవాడ కనకదుర్గను దర్శించుకున్న ఆమె,అనంతరం విలేకరులతో మాట్లాడారు. దుర్గమ్మ అనుగ్రహంతో ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీలోని ప్రతి ఒక్క కార్యకర్త సహకారం తీసుకుంటామన్నారు. అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు.




బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల కరెంట్ మంటలు

'లామా.. రేవంత్ డ్రామా' మంత్రి కేటీఆర్ ట్వీట్

# పవర్ పాలిటిక్స్

**అధికారం('పవర్') అనేది మహామత్తు. దాని కోసం జరిగే గమ్మత్తులెన్నో! ఒకసారి ఆ 'పవర్'ను అనుభవించిన వారు అది లేకుంటే బతకలేమనే పరిస్థితికొస్తారు. 'పవర్'లో ఉన్నప్పుడు ఎంతో శక్తిమంతులుగా కనిపించిన వారే.. అది లేకుంటే ఎందుకూ కొరగారు. అందుకే 'పవర్'లో ఉన్నవారు దాన్ని చేజారకుండా శ్రమిస్తారు. 'పవర్'ను అందుకోవాలని ఏళ్ల తరబడి ఆరాటపడే వారూ దానికోసం తహతహలాడతారు. అందుకోసం ఎంతదాకైనా వెళ్తారు. నీతినిజాయితీలు, మాటతప్పడాలూ పట్టించుకోరు.**

తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై14): కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అమెరికాలో ఉన్నప్పుడు అంటుకున్న ఇరవై నాలుగుగంటల ఉచిత కరెంట్ మంటలు ఆయన హైదరాబాద్ వచ్చాక దారి తప్పాయి. రైతులకు ఉచిత కరెంట్ అవసరమా, లేదా అన్నది అసలు మంటలకు కారణం కాగా, ఉచిత కరెంట్‌పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16వేల కోట్లు ఖర్చు చేస్తూ రూ.8వేల కోట్ల దోపిడీకి పాల్పడుతోందని విలేకరుల సమావేశంలో 'గాలి' మళ్లించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతల భూములకే దాదాపు 12 గంటలు, రైతుల భూములకు 8గంటలే విద్యుత్ సరఫరా అవుతోందని ఆరోపించారు. దీన్ని బలపరిచేలా అదే పార్టీ నాయకులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సబ్‌స్టేషన్ల వద్ద లాగ్‌బుక్‌లు చూసి 24 ఉచిత కరెంట్ అందడం లేదని తేల్చిపారేశారు. చీటికీ మాటికీ గొడవలు పడే కాంగ్రెస్ నేతలను సైతం పవర్ అంశం ఐక్యంగా ఉంచగలిగిందంటే దానికి కారణం' పవర్'ను అందుకోవాలనే ఆరాటమే. రైతులకు పవర్ ఇచ్చేదిలేదని చెబితే ఎవరూ 'పవర్'లోకి రాలేరన్నది తెలిసినందునే రెండు పార్టీలూ దేని శక్తి మేరకు అది ఎదురుదాడికి దిగాయి. ఉచిత పవర్‌ను పరిచయం చేసిందే కాంగ్రెస్ పార్టీ, తమదే ఆ పేటెంట్ అనే అంశం నుంచి మొదలు పెడితే రెండు దశాబ్దాల క్రితం బషీర్‌బాగ్ కాల్పులకు సైతం పవరే కారణమని..దాని వెనుక కూడా కేసీఆర్ పాత్ర ఉందని రేవంత్‌రెడ్డి ఓ ఆకు ఎక్కువే చదివారని రాజకీయం తెలిసిన వారు చెబుతున్నారు. రేవంత్ విలేకరుల సమావేశం అబద్దాలకే మాస్టర్ క్లాస్ అని, 'లామా.. రేవంత్ డ్రామా' అంటూ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా ప్రతిస్పందించారు. రైతులకు పవర్ ఇవ్వాలనే ప్రేమ ఏ పార్టీకైనా తాము 'పవర్'లోకి రావాలన్న ప్రేమేనని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## మభ్యపెట్టడమే కాంగ్రెస్ పని : మండలి చైర్మన్



రేవంత్‌రెడ్డికి ఉచిత విద్యుత్ మంట సెగ తగులుతూనే ఉంది. తాజాగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనపై విమర్శనాస్త్రాలు సంధించారు. పొద్దున లేస్తే ప్రజలను మభ్యపెట్టడమే కాంగ్రెస్ పనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎప్పుడూ రైతులకు వ్యతిరేకమేనని చెప్పారు. ఇంకా ఆరోపణలు చేయడం పద్ధతి కాదు. నల్లగొండలోని తన నివాసంలో గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీలు పెంచుతామంటే కేసీఆర్ వ్యతిరేకించారని, ఆ విషయం అందరికి తెలుసన్నారు. ఈ తొమ్మిదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో కరంట్ బ్రహ్మాండంగా అందుతుందని చెప్పారు.


# ఆల్ ది బెస్ట్

## కొద్దిసేపట్లో.. చంద్రయాన్–3 ప్రయోగం




**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై14):**

**శ్రీహరికోట నుంచి కొద్దిసేపట్లో చంద్రయాన్–3 ప్రయోగం ప్రారంభం కానుంది. ఈ మధ్యాహ్నం 2.35 గంటలకు ఎల్‌వీఎం–3ఎం4ఎం రాకెట్ ద్వారా పైకి ఎగరనుంది. బాహుబలి రాకెట్‌గా పేరున్న దీనికి వందశాతం సక్సెస్‌రేట్ ఉంది. ఈ ప్రయోగం విజయవంతమైతే చంద్రుని దక్షిణ ధ్రువం చేరిన తొలి దేశంగా భారత్ ఘనత సాధించనుంది. చంద్రయాన్–2 విఫలమైన నేపథ్యంలో చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమయ్యేందుకు ఇస్రో అన్ని జాగ్రత్తలు తీసుకుంది.**



## పీఎం మోదీకి ఫ్రాన్స్

# అత్యున్నత పురస్కారం

**పారిస్(జూలై)14:**

పారిస్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆదేశ అత్యున్నత గౌరవ పురస్కారం లభించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ మోదీని 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లిజియన్ ఆఫ్ ఆనర్'ను అందజేశారు. ఆ దేశ మిలిటరీ, పౌర పురస్కారాల్లో ఇదే అత్యున్నతమైనది. మన దేశం నుంచి ఈ అవార్డును అందుకున్న మొదటి ప్రధాని మోదీ కావడం విశేషం. గతంలో ఈ పురస్కారాన్ని అందుకున్న వారిలో దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా, కింగ్ చార్లెస్, ఫ్రాన్స్ మాజీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఐక్యరాజ్యసమితి మాజీ కార్యదర్శి బుట్రోస్ ఉన్నారు.



# నగరంలో బీజేపీ నేత కిడ్నాప్

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై14):**

**హైదరాబాద్ అల్వాల్‌లో బీజేపీ నాయకుడు ఎం. తిరుపతి రెడ్డి కిడ్నాప్ కలకలం రేపుతోంది. తిరుపతిరెడ్డిని ఎమ్మార్వో కార్యాలయం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని ఆయన భార్య పోలీసుల కిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూమిని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ,ఆయన అనుచరులు కబ్జా చేసే యత్నం చేయగా తాము వ్యతిరేకించామని ఫిర్యాదులో తెలిపారు. అందువల్లే తన భర్తను కిడ్నాప్‌చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే తగిన చర్యలు చేపట్టాల్సిందిగా బీజేవైఎం సభ్యులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.**

'అక్రమ రవాణా' వ్యాఖ్యలపై

## పవన్ కళ్యాణ్‌పై కేసు



**తెలుగుప్రభ, విజయవాడ (జూలై14):**

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై కేసు నమోదైంది. ఏపీలోని గ్రామ వాలంటీర్ వ్యవస్థను ఉపయోగించుకొని ఒంటరి మహిళలు లక్ష్యంగా మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆయన చేసిన ఆరోపణలపై ఒక వాలంటీర్ ఫిర్యాదు చేయడంతో కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు.

## లేటెస్ట్ న్యూస్

## ఎన్నికల కసరత్తు షురూ..

### రిటర్నింగ్ అధికారుల నియామకం

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై14):**

**రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు అడిషనల్ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డీఓలు, డీఆర్‌ఓలు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, తదితరులను రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. వీరితోపాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ మునిసిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లను నియమించారు.**




# చెట్లకు పునర్జన్మ

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 14)**

రాష్ట్రంలో కాలుష్యం తగ్గించడమే లక్ష్యమని గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో మరిన్ని వృక్షాలను రీ–లొకేట్ చేస్తామని తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన 20 వృక్షాలను దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ఫాం హౌస్‌లో, మరో 15 చెట్లను వివిధ చోట్ల వట ఫౌండేషన్ సాంకేతిక సహకారంతో నాటారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ మాట్లాడుతూ.. అడగ్గానే తన ఫాంహౌస్‌లో మొక్కలు నాటేందుకు అవకాశం కల్పించిన దర్శకుడు రాజమౌళికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా వృక్షాలను రీలొకేట్ చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

# తల్లడిల్లిన 'ఢిల్లీ'..

### వరదలతో విలవిల

### నీట మునిగిన రాజ్‌ఘాట్, ఎర్రకోట

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ(జూలై 14):**

దేశరాజధాని ఢిల్లీ వరదల దాటికి తల్లడిల్లుతోంది. అక్కడి రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. వర్షం ఆగినా వరద పరిస్థితి తగ్గలేదు. రాజ్‌ఘాట్, ఎర్రకోట, సుప్రీంకోర్టు,తదితర భవనాలు వరదతో నిండాయి. ఎర్రకోట గోడల వరకు నీరు నిలిచిపోయింది. మూడు ప్రధాన నీటిప్లాంట్లు మూతపడ్డాయి. దీంతోతాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యమునకు వరద ఉధృతి తీవ్రంగా పెరగడంతో ఢిల్లీ మునిగే పరిస్థితులేర్పడ్డాయి. ఎటు చూసినా వరదనీరే కనిపిస్తోంది. జనజీవనం స్తంభించింది. ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు అల్లాడిపోతున్నారు. తగ్గినట్టే తగ్గి యమునా ప్రవాహ ఉధృతి పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఢిల్లీ పాత రైల్వే వంతెన వద్ద యమునా నది నీటి మట్టం 208.40 మీటర్లకు చేరింది. వరద ముప్పు ప్రాంతాల్లో ఢిల్లీ మంత్రి అతీశ్ పర్యటించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఆర్మీ ఇంజినీరింగ్ విభాగాలు సహకరిస్తున్నాయని, తమ బృందం రేయింబవళ్లూ పనిచేస్తోందని మంత్రి తెలిపారు. పరిస్థితి మరో 10–12 గంటల ఇలాగే ఉంటుందని, తర్వాత సాధారణ స్థితికి చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

**వాతావరణ శాఖ హెచ్చరికలు**

యమునా నది మహోగ్ర రూపం దాల్చడంతో ఢిల్లీకి వరద ముప్పు ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఢిల్లీలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు ఆదివారం వరకు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వర్క్ ఫ్రమ్ హోం విదానాన్ని పాటించాలని సూచించారు. ఈ క్రమంలోనే ఢిల్లీ వాసులకు మరో షాక్ తగిలింది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో సరఫరా అయ్యే మంచినీటిపై కోత విధించనున్నట్లు కేజ్రీవాల్ సర్కార్ తెలిపింది. దీంతో భారీ వర్షాలు, వరదలతో ఆందోళన చెందుతున్న ఢిల్లీ ప్రజలకు మరో ఇబ్బంది ఎదురైంది.

